# అమ్మాయి పెళ్ళి

రచన: ఏకా వెంకటరామ శేషగిరిరావు

రామేశమ్ శారదకు పెళ్ళిచేద్దామన్న వయస్సుపైబడింది.

అప్పుడు శారదకు 15-వ సంవత్సరం, 5-వ ఫారం చదువుతోంది. చదువుకుతోడు చక్కదనం, ఆరెండింటికి మించిన పనిలో చాకచక్యం అందరిని ఆకర్షించింది. రామేశానికి యిది తీరని సమస్యగా తోచింది. అప్పుడప్పుడూ భార్యకూడా అంటూఉండేది. "ఏమండీ! ఈడేరినపిల్లను ఇంట్లోపెట్టుకొని ఎంతకాలమని ఉపేక్షించి ఊరుకుంటాం. అమ్మాయి ఈడువచ్చేసరికి నేను రెండవకాన్పుకు ఎదురుచూస్తున్నా. ఇంకా అమ్మాయికి పెళ్ళివిషయమే తలపెట్టకపోతిరి." రామేశానికి నెలకు వచ్చే 60 రూపాయిలజీతం ఈ కరువురోజుల్లో సరిగ్గా తిండికే సరిపోక అప్పులపాలవటాన అమ్మాయి పెళ్ళి విషయం అనుకుంటే ఆరోజు నిద్రపట్టేదికాదు. ఉన్న రెండెకరాల పొలంమీదవచ్చే 150 రూపాయలైనా దాచిపెట్టాలనుకుంటే ఏదో ఒక బరువైన ఖర్చు తగలటం తప్పనిసరిగా ఖర్చుపెట్టటం సంభవించేది.

తల్లిదండ్రుల హృదయవేదన శారద గ్రహించింది. ఒకరోజు యిద్దరుకలసి ఏవో సంగతులు మాట్లాడుతూ ఉంటే వారిని సమీపించి శారద తనతో చదువుకునే ఇంజనీరుగారి అమ్మాయిని తనతో పోల్చుకొని "ఆ అమ్మాయి కనీసం రెండేళ్ళయినా నాకన్నా పెద్దదయి ఉంటుంది. ఇంతవరకు పెళ్ళివిషయంగురించి నాందేలేదు. ఆ అమ్మాయి చదువుకున్నంతవరకు చెప్పించటానికి తయారుగా ఉన్నారు పెళ్ళికి యిప్పట్లో స్వస్తిచెప్పి; మీ రెందుకు యింతగా ఆదుర్దా పడవలసివచ్చింది అనే సరికి తల్లిఅందుకొని ఏం ఆదుర్దాఅమ్మాయి! గొప్పవాళ్లు ధనవంతులు ఏపనిచేసినా చెల్లుతుంది. మన విషయం కేవలం వ్యతిరేకం. మనం గోరంత తప్పుచేస్తే కొండంతగా మారి ఊరుఊర, పల్లెపల్లెకు ప్రాకుతుంది. రాధ మాటలు రామేశం హృదయాన్ని హత్తుకపోయి పనిచేయుటం ప్రారంభించాయి. ఈసంవత్సరంలోగా శారదకు తగిన వరుణ్ణి తెచ్చి ముడిపెట్టాలని నిశ్చయించుకున్నాడు రామేశమ్.

పిల్ల సహజసౌందర్యం, తెలివితేటలకు, సంగీతానికి మెచ్చుకొని యమ్. యస్. సి. ప్యాసైన వరుడు చివరకు నాలుగువేలకు కుదిరాడు.

ఈ వరకట్నం బలిసినరోజుల్లో బాగా ఆస్తి, చదువులో ఆరితేరిన ఘటం నాలుగువేలల్లో దొరకటం శారద చూపిన చాకచక్యమే అని రామేశమ్ సంతోషించాడు. కాని ఒకటే గడ్డు సమస్య రామేశాన్ని పట్టి బంధించింది. ఇతను కాదంటే యింకా నాలుగువేలు ఎక్కువ యివ్వటానికి అనేకమంది తయారుగా ఉన్నట్లు రామేశానికి వినికిడి అయింది. కట్నంరూపాయలు మినహా అన్నీ సమకూరాయి. తిరగటం ప్రారంభించాడు. ఎవరూ చోటుపెట్టలేదు. పదీ, అయిదూ అయితే లెక్కలేకుండా ఎవరైనా యివ్వటానికి వెనుతీయరుగాని వేలతో పనికి ఎవరు సాహసిస్తారు. విశ్వప్రయత్నంచేసినా లాభం లేకపోయింది. రోజులు సమీపించాయి. ఎటూ పాలుపోవటంలేదు. ఉన్న రెండెకరాల మెట్టపొలం మీద అయిదువందలరూపాయలకన్నా ఎక్కువబాకీ యివ్వనన్నారు.

ఒకరోజు తిరిగి తిరిగి వేసారి ఇంటికి చేరుకున్నాడు. ఆరోజు తిండిమానేసి పడకకుర్చీలో నడుమువాల్చి ఏదో ఆలోచిస్తున్నాడు. భార్య దగ్గరచేరి "ఇలా మనోవ్యధపడి ఆలోచిస్తే లాభంలేదు. నామెళ్ళో ఆరువరసలగొలుసు, మీ అమ్మయిచ్చిన కాసులుపేరూ, యింకా ఏవో చిల్లరనగలు ఉన్నాయిగా. వాటినైనా పోగొట్టి యీ బెడద వదిలించుకోరాదూ అని అనేసరికి రామేశానికి కొంచం మనస్సు స్థిమితపడింది. ఆమాట తననోటినుంచి రాకుండా తనకు తానే కల్పించుకొని ఒక సదభిప్రాయం వెల్లడించినందుకు లోలోన సంతోషించాడు. పరిపరివిధాలుగా సంచారంచేస్తున్న మనస్సు భార్యవైపు ప్రసరించింది. అంతపనిచెయ్యమంటావా నాచేతులతో. సరే! ఏంచెయ్యమంటారు. ఇన్నాళ్ళు తిరిగి రాగికాణీ అయినా పుట్టించలేకపోతిరి. పెళ్ళి లగ్నం నాలుగురోజుల్లోకి వచ్చె. మీకంతకష్టంగాఉంటే

వడ్డీతో ముట్టచెప్పండి. పొలం బాగా పండితే నాలుగు సంవత్సరాల్లో బాకీ పూర్తిగా రద్దవుతుంది అని ధైర్యం చెప్పింది.

భోజనంచేసి మంచంమీద పడుకొని పడుకోకముందే నిద్ర చల్లని చేతులతో అతని రెప్పలవార్చి జోకొట్టింది. వళ్ళు మైమరిచాడు. తెల్లవారింది. సూర్యకిరణాలు అతని గదిలో ప్రవేశించి చిలిపిగా వెక్కిరిస్తున్నై. కళ్ళు తెరచి జూచేసరికి గడియారం 8 గంటలు కొట్టింది. స్నానం, కాఫీ పూర్తికాగానే తయారై షరాబుకొట్టు వైపుకు వెళ్ళాడు. శర్మగారూ బహుకాలదర్శనం కూర్చోండని షరాబు ఆహ్వానించాడు. అమ్మాయి పెళ్ళి తలపెట్టి, దాంతో ఊళ్ళో నిలకడగా ఉండక అటూ యిటు తిరగటాన ఎటూ పోవటంలేదని ముక్తసరిగా మూడుమాటల్లో జవాబిచ్చి...అయితే ఇప్పుడు నవరసు చిల్లరధర ఎలాగుంది? అని అడిగాడు రామేశమ్.

"డెబ్భైఅయిదురూపాయిల చిల్లరండీ!"

"అయితే మీరేమైనా వస్తువులు కొంటున్నారా?"

"అమ్మేవారుంటే కొనకేం అండీ!"

"అసలు వస్తువేది చూపండి శర్మగారూ. షరాబు గీటురాయితీసి తెచ్చిన వస్తువులు ఒరపిడిచేశాడు. మబ్బు ముక్కతో గీటుగీసి వెలుతురులో పరీక్షించి కొంచం మీ బంగారం ఒకవాసి తగ్గిందండీ!"

"అయితే ఏమంటావ్!"

"మీ బంగారం కాసుగీటుకు రాలేదు ఏమంటారు."

"అయితే ఆధరపడదా?"

"ఏదండీ తూచనివ్వండి. వాటిని తూచి నలుభై రెండు శవర్లు ఉన్నై అని లెఖ చూపించాడు."

"అయ్యో మూడు శవర్లు తగ్గిందే!" అని రామేశమ్ ఆలోచిస్తుండగా డెబ్భైరెండు రూపాయలకైతే నా కివ్వండి అంతకు ఎక్కువ అడిగితే ఎవరికైన యిచ్చుకో వచ్చు అన్నాడు షరాబు రంగయ్య. ఇంకో చోటికిపోతే యింకో ధర తక్కువపడుతుందేమోనని విధిలేక రామేశం ఆ బంగారం సమర్పించి మూడువేల రూపాయలు తీసుకున్నాడు. వెయ్యి రూపాయలతో వెండి చెంబు, కంచం, పట్టుబట్టలు, యితర బట్టలపోరు వెళ్ళబుచ్చుకొని ఇంటికి చేరుకున్నాడు.

వచ్చీ రాకముందే రాధ ఎదురువచ్చి ఏమండోయ్! ఉత్తరం వచ్చింది. ఎల్లుండి ప్రొద్దునకల్లా నాలుగువేల రూపాయలు వాళ్ళకు అందచేయాలట.

ఆ మాటలు వినేసరికి రామేశమ్ కడుపులో రైళ్ళు పరుగెత్తటం ప్రారంభించాయి. రెండువేల రూపాయలు భార్య చేతికిచ్చి గుడ్డల ఖర్చుపోను మిగిలిందని చెప్పాడు.

కంటికి ఆ రాత్రి కూరుపు పట్టలేదు. నిక్షేపంలాంటి సంబంధం చేతులారా జారవిడవటం అతనికి మనస్కరించలేదు. అందులో పిల్లకు పెళ్ళియీడు మీరింది. తెల్లవారకముందే లేచి తన పొలంచేస్తున్న వెంకన్న దగ్గరకుపోయి ఒక ఎకరం నా పొలం అమ్మదలచాను. ఎవరైనా కొనేవాళ్లుంటే చెప్పు యిప్పుడే విక్రయిస్తానని చెప్పాడు. ఇదివరకే దానిమీద కన్నువేసి వున్న వెంకన్న సరే యిప్పుడేవచ్చి మీ కేమాట తేల్చి చెప్పగలనని బైలుదేరి అటుపోయినట్లు పోయి ఎవరూ చేతిలో డబ్బులేదని మొగ్గలేదు. నేనే తీసుకుందామని ఉంది. ఎంతకు యిస్తారని అడిగాడు. సరే యింక నీవు అనుమానిస్తావెందుకు అని రామేశమ్ వెంకన్నతో అన్నాడు.

ఎంతకు యిస్తారని వెంకన్న అడిగాడు. మూడువేలు యిటు పారై యిప్పుడు బేరం చేయటానికి తీరికలేదని రామేశమ్ అనేసరికి వెంకన్న తాననుకున్న ధరకంటే తక్కువ అడిగినందుకు మారుమాట్లాడక మూడు వేలు తీసుకొని ఎకరం పొలం రిజష్టరు చేశాడు. ఈ మూడు వేలు యింకో వెయ్యి కలిపి ఆరోజే వియ్యాలవారికి అందజేశాడు. మిగిలిన డబ్బుతో పెళ్ళి వెళ్ళబుచ్చాడు.

మరో మూడు నెలలు గడచేక కార్యం చెయ్యమని కబురు. విధిలేక ఒప్పుకున్నాడు. కానీ డబ్బు చేతిలో లేదు. ఇదివరకు పరిస్థితే తిరిగి ఏర్పడ్డది. ఎలాగో మిగిలిన ఎకరం తనఖాపెట్టి అయిదు వందల రూపాయలు తెచ్చి కార్యం అనుకున్న రోజుకు జరుపుదామనుకున్నాడు. ఆ రోజు సమీపించింది. అందరూ చేరుకున్నారు.

వియ్యంకుడు వెంకటేశరావు రామేశాన్ని పిలచి ఏమండీ బావగారూ! మీ అల్లుడు ఏదో కోర్సుకు వెళ్ళాలని అభిలాషలో ఉన్నాడు. మీరో వెయ్యి సర్దితే తక్కినవి నా నెత్తిన రుద్దుకుంటాను.

రామేశానికి ఖంగారు ఎక్కువైంది. గత్యంతరం లేక అంగీకార సూచన కనబర్చాడు. మిగిలిన తనఖాపెట్టిన ఎకరం సాహుకారు కోటయ్యకు విక్రయించవలసిన దుర్గతి కల్గింది. మరో రెండువేల రూపాయలు తీసికొని మిగిలిన ఎకరం విక్రయం ఈ కరువురోజుల్లో, పిల్ల అత్తవారిల్లు చేరింది.

జీవనాధారం రామేశానికి ఆ భూమి చాలా కాలంగా...యింక రెక్కలే రామేశానికి మిగిలినవి.